అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం 30 మే 2023

ఆదర్శలో ఇంటర్ ప్రవేశాలకు నేడే ఆఖరు తేదీ

నవతెలంగాణ-సదాశివనగర్

పదో తరగతి ఉత్తీర్ణులైన మాడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు పొందేందుకు నేటితో(మంగళవారం)తో గడువు ముగియనున్నట్టు సదాశివనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భానుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీతో గడువు ముగియనుందని తెలిపారు. ఇంటర్ ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలను www.tsmodelschools.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలికపై లైంగికదాడి



నవతెలంగాణ-బోధన్

ఆటబొమ్మ ఇస్తానని మాయమాటలు చెప్పి బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(5)పై గాజులమ్ముకునే వ్యక్తి బొమ్మలు ఇస్తానని ఆశపెట్టి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు.

పంట వ్యర్థాల కాల్చివేతకు ప్రత్యామ్నాయమేది..?



- తీవ్రమవుతున్న గాలి కాలుష్యం
- ప్రతియేటా ఇదే తంతు
- అవగాహన కల్పించడంలో సర్కారు విఫలం
- భూసారం కోల్పోతున్న వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతుండటంతో రబీ పంటలకు సంబంధించిన వరి కొయ్యలను కాల్చివేస్తున్నారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట వ్యర్థాల కాల్చివేత వల్ల వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఓ వైపు వాయుకాలుష్యం.. మరోవైపు భూమి సైతం సారం కోల్పోతోంది. పంట వ్యర్థాల కాల్చివేతలకు ప్రత్యామ్నాయం చూపడటంలో సర్కారు అలసత్వం ప్రదర్శిస్తోంది. ఈ సమయంలో ప్రత్యామ్నాయం చూపకపోతే.. దేశ రాజధాని ఢిల్లీలా జిల్లా 'గ్యాస్ ఛాంబర్'గా మారడానికి ఎంతో కాలం పట్టదు. పైగా కాల్చివేతల వల్ల గాలిలో నలుపు పదార్థాల తీవ్రత పెరిగి దీర్ఘకాలంలో శ్వాసకోస సమస్యలు ముఖ్యంగా ఆస్తమా బారిన పడే ప్రమాదముందని వైద్యులు సైతం సూచిస్తున్నారు.

వరికోతకు కూలీల సమస్య పెరగడంతో రైతులు వరికోత యంత్రాల వినియోగానికి మొగ్గుచూపుతున్నారు. గంటల్లోనే పదుల సంఖ్యలో ఎకరాల్లో కోతలు పూర్తి చేస్తున్నారు. దీనివల్ల రైతులకు కూలిల ఖర్చు కూడా తగ్గుతోంది. కానీ వరికోత మిషన్లతో వరి కొయ్యలు పూర్తిగా కోయడం లేదు. 30-40 సెంటీమీటర్ల ఎత్తు వరకు కోయ్యలు అలాగే దర్శనమిస్తున్నాయి. మళ్లీ కూలీలను పెట్టి కోత కోయలేక రైతు పంట వ్యర్థాల కాల్చివేతకు సిద్ధమవుతున్నాడు. కానీ ఇది దీర్ఘకాలంలో తీవ్ర సమస్యలకు దారి తీస్తుందని వ్యవసాయాధికారులతో పాటు ఇటు వైద్యులు కూడా చెబుతున్నారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకు వరిసాగు అయ్యింది. అందులో 90 శాతం మంది రైతులు వరి కోత మిషన్లతోనే పంటలు కోశారు. ఇంత పెద్దమొత్తంలో పంట వ్యర్థాల కాల్చివేతకు గురవుతుండటంతో గాలిలో పీఎం(నలుపు పదార్థాల) స్థాయి తీవ్రమవుతోంది. ఇది గాలి స్వచ్ఛతను హననం చేస్తోంది. గాలిలో పీఎం స్థాయి పెరిగితే కళ్ల నుంచి మంట, గొంతు నొప్పి, శ్వాసనాళ్లలో మంట సమస్యలు వస్తాయని అలాగే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే శ్వాసనాలల్లో పనితీరు మందగించి ఆస్తమాకు దారితీసే ప్రమాదముంది.

జిల్లాలో ప్రారంభమైన పంట కాల్చివేతలు..

మరో వారం రోజుల్లో నైరుతి ఆగమనం నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. దీంతో పంట వ్యర్థాల కాల్చివేతను ప్రారంభించారు. మరో వారం పది రోజుల పాటు ఇది మరింత తీవ్రంకానుంది. ఈ విధంగా వ్యర్థాలను కాల్చితే నేలలో సేంద్రియ కర్బన విలువలు తగ్గిపోతాయి. పైగా పంటకు అవసరమైన నేలలో ఉంటే బాక్టీరియా నాశనమవుతుంది. అలాగే ఎరలు, నత్తలు చనిపోయి తదుపరి పంటలో చీడపీడలు పెరుగుతాయి. అంతిమంగా దిగుబడులు తగ్గుతాయి. అయితే వరి కొయ్యలను కాల్చివేయడానికి వాటిని కోసే యంత్రాలను వినియోగించా ల్సిన అవసరముంది. ఇక మిగిలిన కొద్దిపాటి వరి కొయ్యలను నేలలో కలియదున్ని, కలియబెట్టి నేల సారం పెంచుకోవచ్చు. జీలుగ, జనుము విత్తనాలు వేసి పెరిగిన తరువాత అదే నేలలో కలియదున్నాలి. ఫలితంగా వరి పంట దిగుబడి కూడా పెరిగే అవకాశముంది.



మోపాల్ మండలం కంజర శివారులో పంట వ్యర్థాల కాల్చివేత

ఢిల్లీలో బయోడీకంపోజర్ వాడకం..

పంట వ్యర్థాల కాల్చివేతతో ప్రతియేటా ప్రభావితమవుతున్న దేశ రాజధాని ఢిల్లీలో అక్కడి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఢిల్లీలో వాతావరణం కాలుష్యం కాకుండా పంట వ్యర్థాలపై బయో డీ కంపోజర్‌ను చల్లాలని సర్కారు నిర్ణయించింది. ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పంట వ్యర్థాల కాల్చివేతను అడ్డుకోవడానికి ఈ విధానాన్ని రూపొందిం చింది. దీంతో వాతావరణ కాలుష్యాన్ని బాగా నివారించవచ్చు అని అక్కడి అధికారులు భావిస్తున్నారు. గత రెండేళ్ల నుంచి ఢిల్లీ ప్రభుత్వం ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి క్యాప్సూల్‌ను కొనుగోలు చేసి రైతులకు అందిస్తోంది. క్యాప్సూల్‌ను బెల్లం, శనగపిండితో కలిపి పంట వ్యర్థాలపై చల్లాలని సూచించేవారు. కాని గతేడాది మాత్రం నేరుగా ఆ సంస్థ నుంచి మిశ్రమాన్ని కొనుగోలు చేస్తోంది.

ఒక వైపు పట్టాలిస్తామంటూనే

పోడు భూములు గుంజుకోవడం దుర్మార్గం

- సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం

నవతెలంగాణ-రాజంపేట్



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

ఫారెస్ట్ పోడు భూములకు ఒక వైపు ప్రభుత్వం పట్టాలిచ్చేందుకు సిద్ధపడు తుండగా.. మరో వైపు ఫారెస్ట్ అధికారులు పేదల నుంచి పోడు భూములను గుంజుకుంటున్నారని సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలు ఇస్తామని ఉన్న భూమిని గుంజుకోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ కొండాపూర్ షేర్ శంకర్ తండా పరిధిలో సుమారు వందల ఎకరాల భూమిని సాగులో ఉన్న వారిని విడిపించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఫారెస్ట్ అధికారులు పూనుకోవడం దూరదృష్టమని అన్నారు. జూన్ 26న పాస్ బుక్ ఇస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం చెబుతుండగా.. ఫారెస్ట్ అధికారులు దుందుడుకు వ్యవహారాలకు పాల్పడుతున్నారని అన్నారు. 2005 చట్టం అంటే దున్నితేనే కాదు అక్కడ పశువుల మేత కోసం కావచ్చు పండగలు పబ్బుగల శీతల లాంటి పండగ కోసం కావచ్చు ఇటువంటి భూములకు కూడా 2005 చట్టం డిసెంబర్ 13 వర్తిస్తుందని అన్నారు. అందుకనే అటువంటి భూమిని కూడా సర్వే చేసి పోడు హక్కు పత్రం ఇవ్వాలని ప్రభుత్వం ఫారెస్ట్ అధికారులకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండవాసులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరింతగా రాణించాలి

బాక్సర్ హుస్సాముద్దిన్ ను అభినందించిన మంత్రి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



హుసాముద్దీన్‌ను సన్మానించిన మంత్రి

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో బ్రాంజ్ మెడల్ సాధించిన నిజామాబాద్ జిల్లా ముద్దుబిడ్డ హుస్సాముద్దిన్ ను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అభినందించారు. సోమవారం హైదరాబాద్ మంత్రుల సముదాయంలో తన అధికారిక నివాసంలో మంత్రిని హుస్సాముద్దిన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుస్సాముద్దిన్‌కు మంత్రి శాలువా కప్పి, పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో మరింతగా రాణించాలని నిజామాబాద్ గడ్డ, తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం చేయాలని కాంక్షించారు.

కూలిన ఇండ్లు పరిశీలన

నవతెలంగాణ-గాంధారి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామంలో ఆదివారం ఈదురుగాలుల వర్షానికి కూలిన ఇండ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన మల్లమరి పద్మా భాస్కర్ ఇల్లు రేకులు ఎగిరిపోయి గోడలు కులిపోయినట్టు తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరసింహరెడ్డి కూలి న ఇళ్లను సందర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ప్రమీల నారాయణ రెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నరసింహరెడ్డి, బి ఆర్ ఎస్ నాయకుడు విజయ్ రెడ్డి, బిఆర్ఎస్, ఎస్సిసెల్ మండల అధ్యక్షుడు వినయ్ కుమార్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైవేపై దొంగల ముఠా హల్‌చల్

- రెండు రౌండ్‌లు కాల్పులు జరిపిన పోలీసులు
- కారు వదిలి పారిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీ దుండగులు



నిందుతులు వదిలేసిన కారు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అర్ధరాత్రి వేళ.. 44వ జాతీయ రహదారిపై దొంగలముఠా హల్‌చల్ చేసింది. కొన్ని రోజులుగా వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, కాపర్ వైర్‌లను దొంగిలిస్తున్న ముఠా.. వస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి వేళ కాపు కాశారు. బారీ కేడ్‌లను పెట్టి తనిఖీలు చేపట్టగా.. ఒక కారు వేగంగా వచ్చి బారికేడ్‌లను ఢీకొట్టి వెళ్తుండగా.. పోలీసులు రెండు రౌండ్‌లు కాల్పులు కాశారు. కొద్ది దూరం వరకు వెళ్లిన దుండగులు కారును వదిలేసి తప్పించుకున్నారు.

వివరాలు మెయిన్‌లో..

వీవోఏల ముందస్తు అరెస్ట్



వీవోఏలను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలింపు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలో ఐకెపిలో పనిచేస్తున్న వివోఏలను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. తమ సమస్యల సాధన కోసం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లనున్న ఇందిరా క్రాంతి వీవోఏలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వివోఏ సంఘం మండల అధ్యక్షులు ఉమాకాంత్ మాట్లాడుతూ తమ ఇందిరా క్రాంతి పదంలోనే ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నామని ప్రభుత్వం తమ సమస్యలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తే పట్టించుకోని కారణంగా ధర్నాకు వెళ్తుంటే తమను అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నిం చారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరికి బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏలు రఘుపతి, పద్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చేపల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వేసవిలో చేపల పెంపకం పై తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి జీ.రాజనర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాలు ఈ సంవత్సరం 2022 - 2023 గాను పూర్తి స్థాయిలో నిండి ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మత్స్యకారులు కోసం ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో 986 చెరువులలో 458.78 లక్షల చేప పిల్లలను విడుదల చేశామని, ఇప్పుడు వేసవి కాలము అయినందున చెరువులలోని నీరు బాగా తగ్గినందున అధిక ఉష్ణోగ్రతల వలన నీటి విస్తీర్ణం బాగా తగ్గిపోతుందని, దీంతో చేపల ప్రాణ వాయువు బాగా తగ్గుతదని తెలిపారు. గడ్డి, వృక్ష సముదాయం ఎక్కువగా వుండుట వలన చేపలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని, ఈ సమయంలో చేపల అధిక మొత్తంలో చనిపోయే అవకాశం ఉన్నందున చెరువుల్లోని నీటి నాణ్యత, లోతు, నీటి విస్తీర్ణం, చేపల కదలికలు రోజు గమనించాలని కోరారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

డీఎల్‌పీవో శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

నవతెలంగాణ-పిట్లం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, ఇంటింటికి చెత్త సేకరణ, నర్సరీలలో మొక్కల పెంపకంపై పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించి పంచాయతీల సమస్యలను సత్వరమే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు , ఎం పి ఓ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

టీయూలో నిత్య పంచాయితీ

- రిజిస్ట్రార్ కుర్చీ కోసం వాగ్వివాదం
- మసక బారుతున్న యూనివర్సిటీ ప్రతిష్ట
- వీసీపై ఉన్నత విద్య, ఈసీ కమిటీ సీరియస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ కోసం కొట్లాట కొనసాగుతూనే ఉంది. విద్యాబుద్ధులు నేర్పే గురువులే విద్యార్థుల ముందు బాహాబాహికి దిగుతూ టీయూకు మాయని మచ్చ తెస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. రోజుకో వివాదంతో అప్రతిష్టపాలవుతోంది. నిత్య పంచాయితీతో వార్తల్లో నిలుస్తోంది. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వం కానీ ఇటు పాలకులు కానీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



రిజిస్ట్రార్ నియామకంపై వాగ్వివాదం..



కార్యాలయానికి తాళం

తెలంగాణ యూనివర్సిటీలో తాజాగా సోమవారం రిజిస్ట్రార్ కుర్చీ కోసం ఇద్దరు రిజిస్ట్రార్లు ఒకరినొకరు వాగ్వివాదానికి దిగారు. దీంతో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘ నాయకులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది విస్మయానికి లోనయ్యారు. తనకు వైస్ చాన్సలర్ రవీందర్ గుప్త రిజిస్ట్రార్‌గా నియమించి ఆర్డర్ కాపీ ఇచ్చారని కనకయ్య పేర్కొనగా, తనకు ప్రభుత్వం నుంచి రిజిస్ట్రార్‌గా కొనసాగమని ఉన్నత విద్యామండలి కమిషనర్ వాకాటి కరుణ ఆర్డర్ కాపీ ఇచ్చారని యాదగిరి పేర్కొనడంతో వివాదానికి దారి చేసింది. రెండున్నర గంటలు పాటు రిజిస్ట్రార్ ఛాంబర్‌లో విద్యార్థి సంఘ నాయకులు, ప్రొఫెసర్లు ఈ ఘటన స్వయంగా తిలకించి ముక్కున వేలు వేసుకునే పరిస్థితి తలెత్తింది. విద్యార్థి సంఘ నాయకులు ప్రభుత్వం ద్వారా, పాలకమండలి ద్వారా పూర్తి బాధ్యతతో రిజిస్ట్రార్ గా ఉత్తర్వులు ఉన్నవారికే తాము ఆమోదం తెలుపుతామని అప్పటి వరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఛాంబర్ తో పాటు వీసీ ఛాంబర్ను తెరవడానికి వీళ్లేదంటూ తాళాలు వేసి రిజిస్ట్రార్ గదికి తాళం వేయించి మూసివేయించారు.

ప్రభుత్వ అనుమతితోనే బాధ్యతలు స్వీకరించా : ప్రొఫెసర్ యాదగిరి

తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి అనుమతితోనే సోమవారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు నూతన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి స్పష్టం చేశారు. ఈనెల 26న ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్యను వైస్ ఛాన్సలర్ ఇంచార్జి రిజిస్ట్రార్ గా నియమించిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఈనెల 27న ఉన్నత విద్యాశాఖ నుంచి వైస్ ఛాన్సలర్ కు సర్క్యులర్ జారీ చేసిందని అందులో రిజిస్ట్రార్ను నియమించే అర్హత వైస్ ఛాన్సలర్‌కు లేదని, ఒకవేళ నియమిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని సర్క్యులర్ను జారీ చేసిన విషయాన్ని రిజిస్ట్రార్ యాదగిరి వెల్లడించారు. హైదరాబాద్ లో టీయూ పాలక మండలి నిర్వహించిన ఐదు సమావేశాలకు వీసీకి సమాచారం ఇచ్చినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే వైస్ చాన్సలర్ గైర్హాజరు అయ్యారని, ఐదు సమావేశాల్లో కూడా రిజిస్ట్రార్‌గా తననే బాధ్యతలు చేపట్టాలని తీర్మానించిన విషయాన్ని ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతోనే రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. తనకు రిజిస్ట్రార్ పదవి చేయాలనే మోజూ ఎంతవరకూ లేదని ఇదివరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మూడు సంవత్సరాల పాటు రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. కానీ వీసీ నియమించిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులను రిజిస్ట్రార్ ఛాంబర్ లోకి తీసుకువచ్చి గొడవలు సృష్టించడం నచ్చలేదని అన్నారు. పాలక మండలి తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వీసీ అమలు చేయాల్సి ఉంటుందని యాదగిరి అన్నారు. వివిధ సంఘాలతోని, ఎంఆర్పీఎస్ కార్యకర్తలతో ఛాంబర్లోకి చొరవబడి తన విధులకు ఆటంకం కలిగించారని అయన వాపోయారు.

నిత్యం వివాదాలతో చదవలేకపోతున్నాం

తెలంగాణ యూనివర్సిటీ లో గత రెండు నెలలుగా పాలకమండలి, వీసీల మధ్య రిజిస్ట్రార్ విషయంలో తరచూ రోజుకో వివాదం కొనసాగుతుండటంతో తాము చదువుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రిజిస్ట్రార్ ఛాంబర్లో అధ్యాపకులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘల నాయకులు, విద్యార్థులతో మూడు గంటల పాటు గొడవ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థి సంఘల నాయకులు మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ యూనివర్సిటీని అభివృద్ధి చేయాల్సింది పోయి వివాదాలకు తెరలేపుతున్నాడని రోజుకొకరిని రిజిస్ట్రార్ అంటూ ఆర్డర్ కాపిని ఇస్తూ యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాడ న్నారు. దీంతో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారిందని వారన్నారు. రిజిస్ట్రార్ విషయంలో పాలక మండలి సీరియస్‌గా పరిగణించి ఉంటే ఇంత పెద్ద రాదాంతం జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 నెలల కాలంలో వైస్ చాన్సలర్ రవీందర్ గుప్త ఏడుగురు రిజిస్ట్రార్లను నియమించి రాష్ట్రంలోనే ఏ యూనివర్సిటీకి దక్కని చరిత్ర తెలంగాణ యూనివర్సిటీకి దక్కే విధంగా సృష్టించారన్నారు. ఏ యూనివర్సిటీ లో నైనా ఒక రిజిస్ట్రార్ ఏడాది పాటు పనిచేస్తారని, వీసీకి నచ్చితే మరో ఏడాది రెన్యువల్ చేస్తారని, కానీ తెలంగాణ యూనివర్సిటీలో మాత్రం అందుకు భిన్నంగా వీసీ చెప్పిన మాట వినకపోతే తరచూ రిజిస్ట్రార్లను మారుస్తుంటాడన్న ఆరోపణలు ఉన్నాయని వారన్నారు. ప్రభుత్వం నియమించిన వీసీ ప్రభుత్వానికే వ్యతిరేకంగా పనిచేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుందని, ఈ వివాదాలు ఎప్పట్లో ముగుస్తాయో లేదో వేచి చూడాల్సిన అవసరం ఉంది.

వేంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో వ్యవసాయ పంట భూముల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దగ్ధం చేశారు. వేంపల్లి, బోదెపల్లి, వన్నెల్ 'బి' గ్రామ శివారుల్లో ఉన్న వ్యవసాయ భూముల్లో చోరీకి యత్నించారు. అందులో ఉన్న ఆయిల్, కాయిల్స్, రాగి వైర్లను దుండగులు ఎత్తుకెళ్లారు. దాదాపు 8 ట్రాన్స్‌ఫార్మర్లపై చోరీకి పాల్పడ్డారు. రైతులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

చెత్త తొలగింపు



నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-బోధన్

15 రోజులుగా సాలూర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురికి కాలువలు శుభ్రం చేసిన చెత్తను తొలగించారు. చెత్తను తొలగించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతో దానిపై 'చెత్తను తొలగించడంలోను.. నిర్లక్ష్యమే' అంటు సోమవారం నవతెలంగాణ పత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం కాలనీలోని మురికి చెత్తను తొలగించారు.

కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు
- సీఐటీయూ ఆధ్వర్యంలో సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలు, కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని సిఐటియూ జిల్లా కార్యాలయంలో జిల్లా సదస్సు సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. బిజెపి అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల వల్ల అన్ని రంగాల ప్రజానీకంపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. మతోన్మాద చర్యల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురైందని, కులం పేరుతో మతం పేరుతో ప్రాంతం పేరుతో విభజించు పాలించనే రకంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. కార్మికులకు రోజుకు కనీస వేతనం 178 రూపాయలుగా నిర్ణయించిందని, ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచిందని, కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని, ఈ రకంగా కార్మిక వర్గంపై దాడికి పాల్పడిందని అన్నారు. 460 రూపాయలు ఉన్న గ్యాస్ బండ 1260 రూపాయలకు పెంచిందని, నిత్యావసర సరుకుల ధరలు ఎన్నో రేట్లు పెరిగాయని, కార్మికులకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు చేస్తుందని, స్కీం వర్కర్లపై దాడి చేస్తుందని ఆశ అంగన్వాడి వీవో ఏలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ హమాలీలు భవన నిర్మాణ కార్మికులు తదితర సంఘటిత అసంఘటిత రంగాలపై బిజెపి ప్రభుత్వం విచ్చలవిడి దాడిలకు పాల్పడుతుందని. అన్నారు. దీనికి వ్యతిరేకంగా సమైక్యంగా కార్మిక వర్గం మొత్తం పోరాటాల కుసిద్ధం కావాలని, రాబోయే సాధారణ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మికులు నిరుపేదలుగా మారుతున్నార,ని స్కీం వర్కర్లను, ప్రైవేటీకరించాలని ఇప్పటికే ప్రభుత్వం పూనుకుందని ఆమె విమర్శించారు. రాబోయే కాలంలో విస్తృతంగా కార్మిక పోరాటాలు చేయాలని. ఈనెల 30న సిఐటియూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జెండా ఆవిష్కరణ జరపాలని, గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలపైన భవనిర్మాణ కార్మికులు, అంగన్వాడి, ఆశాలు, బీడీ, వీవోఏ అసంఘటిత రంగం సంఘటిత రంగంపై ఉద్యమాలు చేపట్టాలని పిలువు నిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, సిఐటియు జిల్లా కోశాధికారి స్వర్ణ, జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, కృష్ణ, ఫారుక్, గంగామణి, జరీనా, యాస్మిన్, కాలేజ్, గణేష్, రాజేష్, సాయిలు, గంగారాం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌బాబు

వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అదృశ్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ కుమార్ సోమవారం తెలిపారు. వినాయక్ నగర్ కు చెందిన జితకరి దత్తం తన తండ్రి కనబడడం లేదని ఫిర్యాదు చేశాడు. జితకరి బాలయ్య (75) తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి వస్తానని కొడుకుకు చెప్పి వెళ్ళాడు. కానీ అయిన తన కూతురు ఈనెల 28న ఉదయం తన కూతురు చిట్టి రుద్మకు చెప్పి ఇంట్లో నుండి బయలుదేరి ఇంటికి వెళ్తున్నాను అని చెప్పి ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు, మహిళలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సోమవారం అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్ల వల్ల ఉపశమనం కలుగుతుందని తద్వారా ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా మంచి నీటిలో కలుపుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సుమతి, హెల్త్ ఆఫీసర్ నిరీక్షణ, ఆశ వర్కర్లు అనిత, ఉమా, అమృత, లక్ష్మీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన ముండ్ల శంకర్ (గల్ఫ్ కార్మికుడు) కుటుంబాన్ని ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ సోమవారం పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. రూ.10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కొంతకాలం కిందట దుబాయ్ నుండి వచ్చి ఆటో డ్రైవర్‌గా పని చేసి ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న సునీల్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2000-01లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ...పాత రోజులు గుర్తుకుతెచ్చుకున్నారు. అనంతరం తమ గురువులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పి, సక్రమమార్గంలో పయనించేలా చేశారని,సమాజంలో మేము ఈ స్థాయిలో ఉన్నామంటే కారణం గురువులని అన్నారు. తప్పు చేస్తే దండించడం అప్పుడు మాకు బాధనిపించినప్పటికి, సలహాలు, సూచనలు జీవితంలో ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత గురువే దైవంఅని అప్పట్లో చెప్పిన మాట చాలాసార్లు గుర్తుకొచ్చిందని అన్నారు.

ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఏర్గట్ల విద్యార్థినుల ప్రతిభ

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఏర్గట్ల విద్యార్థినులు సత్తాచాటారు. ఈ నెల 26, 27, 28 తేదిల్లో గోవాలో జరిగిన పోటీల్లో ఏర్గట్లకు చెందిన సుధనవేణి లతిక అండర్ 16 విభాగంలో, నూనె శ్రీనిధి అండర్ 12 విభాగంలో కాంస్య పథకాలు సాధించినట్లు జగిత్యాల్ జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి 2 వేల మంది వరకు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులకు జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ సంస్థ వ్యవస్థాపకులు సెన్సాయి పాషా చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు. కరాటే పోటీల్లో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ సాధించడంతో ఏర్గట్ల గ్రామస్థులు వారిని అభినందించారు.



క్యాంప పతకాలు సాధించిన విద్యార్థులు

పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగించిన ఎస్సై

నవతెలంగాణ-మోపాల్

పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులకు సంబంధిత వ్యక్తికి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సోమవారం అందజేశారు. మండలంలోని పోలీస్ స్టేషన్‌లో సిర్పూర్ గ్రామానికి చెందిన బాబా గౌడ్ అనే వ్యక్తి ఫోన్ పోయిందని కంప్లైంట్ చేశారు. దీంతో ఎస్సై మహేష్(సిఇఐఆర్) ద్వారా పోయిన ఫోన్‌ని పట్టుకున్నారు. తన ఫోను పోయిన వెంటనే విచారించి తిరిగి ఇచ్చినందున ఎస్ఐకి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ విజయాలు దశాబ్ది ఉత్సవాల్లో గొప్పగా చెప్పుకోవాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్/ఏర్గట్ల

తెలంగాణ విజయాలు దశాబ్ది ఉత్సవాల్లో గొప్పగా చెప్పుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నియోజకవర్గస్థాయి అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 21 రోజులపాటు జరుపుకునే ఉత్సవాలపై చర్చించారు.

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యేలా కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం సాధించిన తర్వాత కేసిఆర్ ప్రభుత్వం బాల్కొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమంపై అనేక రంగాల్లో సాధించిన విజయాలు గ్రామ గ్రామాన వివరించాలన్నారు. తెలంగాణలో 60 ఏండ్లలో జరగని అభివృద్ధి కేవలం 9 ఏళ్లలో చేసి చూపించారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు యాసంగిలో 16 లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యేది. నేడు 56 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని అన్నారు. నేడు దేశానికే అన్నం పెడుతున్న రాష్ట్రం తెలంగాణ అని గర్వంగా చెప్పుకునేలా కేసిఆర్ చేశారని అన్నారు. ఇలా సాధించిన విజయాలు దశాబ్ది ఉత్సవాల్లో గొప్పగా చెప్పుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో, మండల వారిగా, గ్రామాల వారీగా ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు, ప్రజలతో సమన్వయ కమిటీ జాబితా సిద్ధం చేశారు. సమావేశంలో ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, డిసిఓ సింహాచలం, ఏసిపి ప్రభాకర్ తహసిల్దర్లు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు బంధు సమితి నాయకులు, సభ్యులు, సొసైటీ సభ్యులు, మహిళా సంఘాలు నేతలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: జూన్ 2 నుండి 22 వరకు నిర్వహించబోయే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల అధికారులతో, నాయకులతో తహసీల్దార్ జనార్దన్ దశాబ్ది ఉత్సవాల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ, మండలస్థాయిలో జరుగబోయే కార్యాచరణను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పిఏసీఎస్ చైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య,పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ రాజేశం,ఎంపీఓ శివ చరణ్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అధికారులతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 21 రోజులపాటు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నీరం, జడ్పిటిసి కమల నరేష్, తహసీల్దార్ లత, ఎంపీడీవో లింగం నాయక్, ఎంపీవో ఇక్బాల్, మండల వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి, ఏపీఎం మోహన్, ఎస్సై మహేష్ కుమార్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ మరియు పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి, ఆర్ఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన ఆలూరు, మచ్చర్ల నాయకులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నయాకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలం సుభాష్ విగ్రహం నుండి మచ్చర్లకు వెళ్లే రోడ్డు కొరకు శాసనసభ్యులు జీవన్ రెడ్డి హైదరాబాదులోని తన నివాసంలో సోమవారం ఆలూర్, మచ్చర్ల గ్రామాల పెద్దలు ఎమ్మెల్యేను కలిశారు. ఆలూర్ నుండి మచ్చర్ల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయమని విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత మంత్రితో ఫోన్ లో మాట్లాడుతూ ఆలూర్ నుండి మచ్చర్ల వరకు ఉన్న రోడ్డుని బీటీ రోడ్ వేయాలని మంత్రిని కోరారని తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఎమ్మెల్యే, మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఎంపీటీసీ కుమ్మరి లక్ష్మి మల్లేష్, పెద్దమనుషులు తొర్లి మల్లారెడ్డి, మంతెన నారాయణ, ముక్కెర గంగారెడ్డి, గడేపల్లి, సుజిత్, నూతుల గంగారెడ్డి, మచ్చర్ల అశోక్, ఆనంద్, రమేష్, లింగం తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 శాతం సబ్సిడీ ఇవ్వాలి

- తెలంగాణ ఎలక్ట్రికల్ మోటార్ రీవైండింగ్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్ మెకానిక్‌లకు ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 శాతం సబ్సిడీ ఇవ్వాలని తెలంగాణ ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కె.రాజ కిషన్ అన్నారు. సోమవారం నగరంలోని పాత కలెక్టరేట్ నుండి నూతన కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిక్షించాలని నిరసన వ్యక్తం చేసి అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 76ఏండ్ల నుండి వ్యవసాయ బావి, బోరు మోటార్లు, ఇండ్రస్ట్రీయల్, గ్రామ పంచాయతి, మున్సిపాల్టి వాటర్ సప్లై మోటార్ల పనులు చేస్తున్నామన్నారు. అద్దె ఇండ్లలో ఉంటూ కిరాయిలను కట్టు కుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దారిద్ర్యరేఖ దిగువన ఉన్న మెకానిక్ లను గుర్తించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, నెలకు రూ. 5వేల జీవన భృతి కల్పించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో మెకానిక్ కమ్యూనిటి కోసం 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి, ప్రతి టౌన్, మండల కేంద్రాలలో 5 గుంటల ప్రభుత్వ భూమిని కమ్యూనిటీ హాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్ అసోసియేషన్ సభ్యులు, మెకానిక్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

- పోచారం సురేందర్ రెడ్డి



భూమిపూజల చేస్తున్న సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

మండలంలోని అంతాపూర్ గ్రామంలో సోమవారం జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ భోగ్ బండారో పూజ చేసి మందిరం ప్రహరీ గోడనిర్మాణం, కొత్త గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి బాన్సవాడ బీ ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జి పోచారం సురేందర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరుచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ జగ్ రామ్, ఎంపీపీ శ్రీ మేక వీర్రాజు, మండల తెరాస ప్రసిడెంట్ గిరి, సొసైటీ చైర్మన్ నామాల సాయిబాబు, ఉప సర్పంచ్ నెహ్రు, గ్రామ తెరాస ప్రెసిడెంట్ నర్సింగ్, సెక్రటరీ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషన్, శంకర్, మంగ్యా,టాక్య, లచ్చిరాం, శ్రీను, దేవీలాల్, గోవింద, సురేష్,రామకృష్ణ,ఉస్మాన్ పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సరళకు సత్కారం


నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

అవార్డు అందుకున్న నిజామాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సరళను వి.వి.సుబ్బారెడ్డి ఇన్‌స్పెక్టర్ ఆర్‌పిఎఫ్, టి.ప్రత్యూష సబ్ ఇన్‌స్పెక్టర్, డి.ప్రవీణ్ కుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌పిఎఫ్ అవార్డుతో సత్కరించారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఈకార్యక్రమం సోమవారం నిర్వహించారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో నడుస్తున్న రైలులో దిగేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరు మహిళా ప్రయాణికుల ప్రాణాలను కాపాడినందుకు మాజీ రాష్ట్రపతి నుండి అవార్డు రూ.50వేలు ప్రైజ్ మనీ తీసుకున్నారని తెలిపారు.



సరళను సన్మానిస్తున్న రైల్వేఅధికారులు, సిబ్బంది

4న బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పశ్యపద్మ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్.పశ్య పద్మ అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం కే.భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఏప్రిల్ 14 నుండి ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని. ముగింపు కార్యక్రమాన్ని కొత్తగూడెంలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కొత్తగూడెంలో జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలు, కార్యకర్తలను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై ఓమయ్య, కే రాజన్న, ఏ.విటల్ గౌడ్, ముల్తాన్ పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు ఇచ్చేవరకు పోరు తప్పదు

నవతెలంగాణ-ఎడపల్లి

ఇండ్లులేని పేదలను గుర్తించి రెండు పడకల గదుల ను మంజూరు చేయాలని, లేనిపక్షంలో రెండు పడకల ఇండ్లు ఇచ్చేంతవరకు పోరుబాట తప్పదని బిజెపి సీనియర్ నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్ రెడ్డి, పోచారం జమలం గ్రామాల సర్పంచులు కోల ఇంద్రకరణ్, రాజ్యలక్ష్మి హనుమంత్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మంగల్ పాడ్ చౌరస్తా వద్ద నుండి బిజెపి నాయకులు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ ఆకుల శేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలుగా ప్రజల్ని దగా చేస్తూ ఇప్పుడు ఆ పథకానికి గృహలక్ష్మి అని పేరు పెట్టడం సరికాదన్నారు. ఐదు లక్షల రూపాయలతో ప్రభుత్వమే ఇంటిని కట్టిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఏ ఒక్క మండలంలో పూర్తిస్థాయిలో రెండు పడకల గదుల నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ఎడపల్లి మండలంలో మూడు గ్రామాలలో మాత్రమే రెండు పడకల గదులు నిర్మించినప్పటికీ వాటిని పేదలకు ఇవ్వడంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. డబుల్ ఇండ్ల పథకానికి గృహలక్ష్మి అనే నామకరణ చేసి మూడు లక్షలు ఇస్తామని స్థలం ఉంటే కట్టుకోవాలని మళ్లీ మళ్లీ చెప్పి ప్రజల్ని మభ్య పెడుతున్నారని ఆరోపించారు. మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా 3 లక్షల రూపాయలు ఇచ్చిన పాపన లేదని వారన్నారు. అర్హులైనటువంటి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న పేదవాళ్ళ ఎవరైతే అప్పు చేసి ఇల్లు కట్టుకున్నారో మూడు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదుపరి మూడు విడతలుగా ఇల్లు కట్టుకునే వారికి ఇవ్వాలని నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల బిజెపి అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, నాయకులు ఉప్పు సురేష్,పుట్టి సంతోష్, బండ కృష్ణ, బండ గంగాధర్, సుప్పాల భూపతి, బీజేవైఎం ఎడపల్లి మండల కన్వీనర్ సాయి, ప్రణయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

జూన్ 4 ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరుగు సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు అన్నారు. సోమవారం పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ లో వాల్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కెసీఆర్ ప్రభుత్వం నీళ్ళు నిధులు నియామకాలు దళితులకు మూడెకరాల భూమి అంటూ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడి ప్రభుత్వం నల్లధనాన్ని అరికట్టి నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి ఖాతాల్లో 15లక్షల రూపాయలు వేస్తానని జీరో ఖాతాలు తీసుకోవాలని చెప్పి ఇప్పటివరకు 15రూపాయలు వేసిన దాఖలాలు లేవని అన్నారు. కార్యక్రమంలో మౌల శ్రీకాంత్, రహీం, శ్రీను, నదీం, పరశురామ్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



జీలుగ విత్తనాలు అందజేస్తున్న చైర్మన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు జీలుగు విత్తనాలను సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో 30 కేజీల బ్యాగు 842.70 రూపాయలకు విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ తీసుకువచ్చి జీలుగు విత్తనాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయి రెడ్డి, వైస్ చైర్మన్ రత్నం, ఎండోమెంట్ చైర్మన్ సిద్ధ రాములు, ఆర్ఎస్ఎస్ కన్వీనర్ దుర్గారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, సీఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కామారెడ్డి (తాడ్వాయి)

కామారెడ్డిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దాని పరిధిలోని స్టేషన్‌లలో నేడు (30వ తేదీ) మంగళవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం నెలకొననున్నట్టు డివిజనల్ ఇంజనీర్ సాలియా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (మంగళవారం) ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్తు మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కామారెడ్డి టౌన్, కామారెడ్డి రూరల్, ఎస్ఎస్‌నగర్, తాడ్వాయి మండలాలల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగనుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సూచించారు.

ప్రజావాణి వినతులకు పెట్టె ఏర్పాటు



పెట్టెలో వినతులు, ఫిర్యాదులు వేస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం వాయిదా వేయగా, కొందరు బాధితులు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు, వినతులు ఇచ్చేందుకు వచ్చారు. దీంతో వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుక కలెక్టరేట్ గేట్ వద్ద వినతుల పెట్టెను ఏర్పాటు చేశారు. అక్కడకు వచ్చిన బాధితులు వారి ఫిర్యాదులను ఆ పెట్టెలో వేశారు.

మల్లారం గ్రామ శివారులో చైన్ స్నాచింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మల్లారం గ్రామ శివారులో చైన్‌స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ లింబాద్రి వివరాల ప్రకారం.. నగరంలోని కోటగల్లికి చెందిన సింగారం పూజ, ఆమె తల్లి సునీత ఇద్దరు కలిసి మల్లారం గ్రామ శివారులోని లింగేశ్వర గుట్ట ఆలయ మెయిన్ రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. సుమారు మధ్యాహ్నం సుమారు 2.45 నిమిషాల సమయంలో ఒక గుర్తితెలియని వ్యక్తి ఆరెంజ్ కలర్ బండిపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకొని పారిపోయాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ జంగం భూషణం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను గ్రామ సర్పంచ్ జంగం భూషణం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామానికి ఎంతో అవసరమని అన్నారు. క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి ఉన్నత స్థానాలకు చేరాలని కొనియాడారు. క్రీడాకారులకు అండగా ఉంటానని అందుకే తన సొంత డబ్బులతో దుస్తులు అందజేసినట్టు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బొడ్ల రాజు

నవతెలంగాణ-పిట్లం

రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తగా కృషి చేస్తానని ఆ పార్టీ టౌన్ మాజీ అధ్యక్షుడు బొడ్ల రాజు అన్నారు. పదవీ కాలం ముగియడంతో సోమవారం పదవికి రాజీనామా చేసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను అధ్యక్ష పదవిలో కొనసాగినంత కాలం అన్ని విధాల కృషిచేసిన పార్టీ పెద్దలు , అనుబంధ సంస్థల అధ్యక్ష కార్యదర్శులు , కార్య కర్తలు , అభిమానులు అందించిన సహాయ సహకారాలకు రుణపడి ఉంటానన్నారు. త్వరలో మండల కాంగ్రెస్ పార్టీ అభీష్టం మేరకు కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన టౌన్ అధ్యక్ష పదవిని ఎన్నుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కోనేరు కృష్ణ , మొహెజ్ , ఇమ్రాన్ , జోలక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో సోమవారం టాస్క్ ఫోర్స్ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పేకట నిర్వహిస్తున్న బుచ్చన్నను అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 30 వేల నగదు, 14 సెల్‌ఫోన్‌లు, కార్డులు స్వాధీనం చేసుకున్నట్టుతెలిపారు. పోలీస్ స్టేషన్లో ఎస్సై శివరామ్‌కు అప్పగించినారు.

100 మంది విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత నెల ఏప్రిల్ 16 న నిర్వహించిన టిఎస్ మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు ఎంపికైన 100 మంది విద్యార్థుల లిస్ట్ ను మోడల్ పాఠశాల లో అందుబాటులో ఉంచినట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ కూమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంగళవారం నుండి వెరిఫికేషన్ ప్రక్రియకు ఒరిజినల్ సర్టిఫికెట్ తో హాజరు కావాలని కోరారు. కుల ధృవీకరణ పత్రం, ఆదాయం, ఐదవ తరగతి పిసి, రికార్డు షిట్, ఆధార్ కార్డు జిరక్స్, ఈడబ్లుఎస్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, సెట్ తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు పాఠశాలలో చేరడానికి జూన్ 9వ తేదీ వరకు అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ గణేష్ కూమార్ తెలిపారు.

ప్రగతి చాటేలా ఆవిర్భావ వేడుకలు

- అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
- సీఎస్‌తో వీసీలో ఇరు జిల్లాల కలెక్టర్‌లు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)/నిజామాబాద్‌సిటీ



కామారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రభుత్వ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాలో పండుగ వాతావరణంలో వైభవోపేతంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌లతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రగతి పనులు చాటేలా వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది వేడుకలలో ప్రగతి చాటేలా విధంగా ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు ఎస్పీ అన్యోన్య, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రాశస్త్యం చాటేలా దశాబ్ది ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికారులతో సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, జిల్లాకు చెందిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సైతం దిశానిర్దేశం చేశారని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 106 రైతు వేదికలలో రైతు దినోత్సవం నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మంచి నీళ్ల పండుగ కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని నాలుగు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ప్రజాప్రతినిధులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హరితోత్సవంలో భాగంగా నియోజక వర్గ కేంద్రాలతో పాటు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో విరివిగా మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ముఖ్యంగా 2014 కు ముందు అటవీ ప్రాంతాలు ఎలా ఉండేవి, ప్రస్తుతం హరితహారం అమలు చేసిన నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పచ్చదనం పెరిగిన విషయాన్ని శాటిలైట్ ఫోటోల ద్వారా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, ప్రజాప్రతినిధుల సహకారంతో దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చిత్రమిశ్రా, చంద్రశేఖర్, ట్రైనీ ఐ.ఏ.ఎస్ కిరణ్మయి, అదనపు సీపీ గిరిరాజా, జెడ్పి సీఈఓ గోవింద్, సీపీఓ బాబురావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వకుండా ఉద్రేకాలు

- మతం పేరుతో యువతను పెడదోవ పట్టిస్తున్న కేంద్రం : పీవైఎల్

నవతెలంగాణ-గాంధారి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రగతిశీల యువజన సంఘం రాష్టం రెండవ మహాసభ వాల్ పోస్టర్‌ను మండలంలోని దుర్గంలో నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్ సింగ్ మాట్లాడుతూ జూన్ 5, 6 తేదీల్లో ఖమ్మం లో జరిగే రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఏటారెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రాష్ట్రంలో అధికారం లో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఇంటికొక ఉద్యోగం ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చాయని ఈ హామీలను అమలు చేయకపోవడంతో నిరుద్యోగ యువతలో నిరాశనిస్పృహలు పెరిగిపోయాయని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు యువతను తప్పుదారి పట్టించేందుకు ఉద్రేకాలు పెంచుతున్నారని, మత ఉన్మాద చర్యలతో తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలురాక ఉపాధి లేక నిరాశకు గురైన యువకులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇస్తామని లేదా నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాల మోసపూరిత చర్యల కారణంగానే యువతీ యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనేభర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు కేసిఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు నెలకు 3116 రూపాయల నిరుద్యోగ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని ఉపాధి కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ, మత ఉన్మాదాలకు వ్యతిరేకంగాపోరాడేందుకు యువకు లను సరైన దారిలో నడిపించేందుకు పివైఎల్ మహాసభలలో చర్చించి తగిన కార్యాచరణ రూపొందించ బోతున్నామని ఆయన తెలిపారు. ఈ సభకు పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు పి.వరదయ్య అద్యక్షత వహిస్తారని సభలకు ప్రొఫెసర్ హరగోపాల్ , ప్రముఖసినీ డైరెక్టర్, నటుడు ఆర్.నారాయణమూర్తి తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ నాయకులు సాంబాజీ, శ్రవణ్, శ్రీకాంత్, పిడియస్‌యు జిల్లా అధ్యక్షులు సతీష్, ఉపాధ్యక్షులు మోజీ రామ్ పండరి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

వ్యవసాయ యంత్రాలు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చేసి పరికరాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు


నవతెలంగాణ-తాడ్వాయి

ట్రాక్టర్ రోటవేటర్లు దొంగిలించిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎల్లారెడ్డి డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన బాయమొల్లా స్వామి(45), తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన బోదాసు సాయిలు (31) లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. తాడ్వాయి మండలంలోని దేవాయపల్లి గ్రామ శివారులో బోరుబావి వద్ద నిలిపి ఉంచిన అదే గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి ట్రాక్టర్ రోటవేటర్‌ను, కృష్ణాజివాడి గ్రామ శివారులో నిలిపించిన ఒక రోటవేటర్, రాజంపేట మండల కేంద్రంలో ఒకరోటవేటర్, దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత రాజంపేట్‌లో ట్రాక్టర్ పెద్ద నాగలి, రాజంపేట మండలం పొందుర్తి దగ్గర నిలిపించిన ట్రాక్టర్ పెద్ద నాగలిలను వీరు దొంగిలించారు. పక్కా సమాచారంతో సాంకేతికంగా ముందుకు వెళ్లి ఇద్దరినీ పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగిలించిన రోటవేటర్లను, పెద్ద నాగలి పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన మంగలి బాబుకు ట్రాక్టర్ యొక్క పరికరాలు అని చెప్పి విక్రయించారు. మిగతావి వారి ఇంటి వద్ద రోటవేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీటి విలువ రూ 2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీం ను ఏర్పాటు చేసి వీరిని పట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సిఐ రామన్, తాడువాయి ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ సంజీవులు, కానిస్టేబుళ్లు రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలు బతకలేని పరిస్థితి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మాజీ మంత్రి షబ్బీర్ ధ్వజం

నవతెలంగాణ-తాడ్వాయి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి షబ్బీర్‌అలీ

కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో సోమవారం రోజున వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే షబ్బీర్ అలీ తోనే సాధ్యం అని భావిస్తూ బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసి నవీన్ కుమార్, డీకే స్వామి, బిజెపికి చెందిన రాజశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది అనుచరులతో కాంగ్రెస్ పార్టీ లో చేరినట్టు తెలిపారు. ఒకప్పుడు సర్పంచులు, ఎంపీటీసీలకు ఎంతో గౌరవం ఉండేదని.. టీఆరెస్, బీజేపీ అధికారంలోకి వచ్చాక స్థానిక నాయకులంటే పైరవీకారులన్న ముద్ర పడిందన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో టీఆరెస్, బీజేపీ చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల కోసం రోజుకో పంచాయితీ తీసుకొస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. కామారెడ్డి లో కాంగ్రెస్ గెలుపునకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కంటి వెలుగు ప్రతిష్టాత్మకం



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవిబాయి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బీర్కూర్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు పథకంలో ప్రవేశపెట్టిందని కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీర్కూర్ ఎంపీపీ రఘు తెలిపారు. సోమవారం మండలంలోని బీర్కూర్ తండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘు మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు ఇస్తారని చెప్పారు. గ్రామస్తులు ప్రభుత్వం ఉచితంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. అవసరం ఉన్నా లేకపోయినా ప్రతి ఆరు మాసాలకు ఒకసారి కంటి పరీక్ష చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవిబాయ్, ఉపసర్పంచ్ రుక్మిణి, కంటి వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

రైతుల లాభం కోసమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ తరపున ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రబీ పంట కింద మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు తమ పంట పొలాల్లో జొన్న పంటలను సాగు చేశారని రైతులు పండించిన జొన్నలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వడం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడంతో ప్రభుత్వం స్పందించి జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు మంజూరు ఇచ్చిందని తెలిపారు. రైతులు పండించిన జొన్న పంట క్వింటాలకు మద్దతు ధర 2970 రూపాయలు నిర్ణయించడం తెలిపారు. రైతుల లాభం కోసమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు తమ పంటలను దళారులకు అమ్మ వద్దని కొనుగోలు కేంద్రాల్లో తీసుకువచ్చి అమ్ముకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంగారెడ్డి, సర్పంచ్ తిరుమలరెడ్డి, ఉప సర్పంచ్ విట్టల్, సీఈఓ సందీప్, సంజు, ఏఈఓ ప్రియాంక, రూప, రైతులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌కు సన్మానం



నర్సయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-దోమకొండ

సిడిసి చైర్మన్‌గా నియామకమైన ఐరేని నర్సయ్యను శివ రామ్ మందిర్ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో ఆలయం కమిటీ సభ్యులు సోమవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీడీసీ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ చెరుకు రైతుల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శివరం మందిర్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెకు పచ్చతోరణం

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు పెరిగి అందమైన పూలతో పల్లెకు తోరణంగా మారాయి. చందూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా చెట్లు నీడనివ్వడంతో పాటు పూసిన పువ్వులతో కనువిందు చేస్తున్నాయి.



దాడిచేసిన వ్యక్తికి ఏడాది శిక్ష

నవతెలంగాణ-బోధన్

వర్ని మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా త్యాపల లలితపై గత సంవత్సరం ఏప్రిల్ 24న ఇనుప రాడ్‌తో దాడి చేసిన ఘటనలో బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయకుమార్ సాయిబాబాకు సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వర్ని ఎస్ఐ ఆనంద్ సాగర్, ఎస్ఐ అనీల్ రెడ్డి కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయ్య వాదించారు. న్యాయమూర్తి కేసు పూర్వ పరాలను పరిశీలించి నిందితుడికి సంవత్సరం కఠిన కారాగార శిక్ష , 100 రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమాన కట్టలేని ఎడల 15 రోజుల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని వెల్లడించారు. ఈ కేసుకు ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి, లైసెన్ పోలీస్ ఆఫీసర్ సాయన్న, కోర్టు కానిస్టేబుల్ దేవ లింగన్న సహకరించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపారు.

బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్
- మహిళా రెజ్లర్లపై కేంద్ర బలగాల దమనకాండ నశించాలి
- పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ, పీవైఎల్



కంఠేశ్వర్ : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) భారత ప్రజాతంత్ర యువజన సంఘం కమిటీల ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా దగ్గర ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ చేతులు కట్టేసుకొని,న ల్ల బాడ్జిలతో మౌన నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పిట్ల నరేష్ మాట్లాడుతూ.. నిన్న నూతన పార్లమెంట్ భవన ప్రారంభం సందర్భంగా భారత మల్లయోధులు భారత జెండాను పట్టుకొని శాంతియుత నిరసన తెలుపుతుండగా పోలీసులు వారిని అమానుషంగా కొడుతూ, కనీసం త్రివర్ణ పతాకాన్ని కూడా గౌరవించకుండా కింద పడేయడం సిగ్గు చేటని అన్నారు. అదే విధంగా మహిళ మల్ల యోధుల పట్ల బిజెపి ఎంపీ రెజ్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులు చేస్తున్నాడని అసోసియేషన్‌కు పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ఐదు నెలల నుండి పోరాటానికి చేస్తున్నారన్నారు. దీంతో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసారే తప్ప అరెస్టు చెయ్యలేదని తెలిపారు. బ్రిజ్‌భూషన్ బీజేపీ ఎంపీ అయినందున ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించపోవడం బాధాకరమని అన్నారు.

దేశ ప్రధాని ఒక సినిమా గురించి మాట్లాడతారు కానీ దేశ గౌరవాన్ని ప్రపంచ దేశాలలో చాటిచెప్పే ఒలింపిక్స్ మెడల్స్ సాధించిన క్రీడాకారుల సమస్య గురుంచి కనీసం స్పందించకపోవడం చూస్తుంటే దేశం పట్ల దేశభక్తి కంటే అధికారం కోసం ఓట్ల భక్తియే ఎక్కువ అయినట్టు తెలిస్తుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ని అరెస్టు చేసి ,కఠినంగా శిక్షించాలని లేని యెడల దేశవ్యాప్తంగా అని రంగాల క్రీడాకారులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు దీపిక, సందీప్ డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆశీర్వాదం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు శైలజ, దుర్గశ్రీ, సాయికిరణ్, ఆజాద్, సాయినాథ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ :ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై కేంద్ర బలగాల దమనకాండ నశించాలని పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా రెజ్లింగ్ క్రీడాకారులు తమకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే కేంద్ర బలగాల ద్వారా రెజ్లర్ల పోరాటాన్ని అణచివేయడాన్ని, అరెస్టులను నిరసిస్తూ సోమవారం నిజామాబాద్ నగరంలో ధర్నా చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. గోదావరి, కే.సంధ్యారాణి, పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు జీ.మారుతి మాట్లాడుతూ... క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను తక్షణమే బాధ్యతల నుండి తొలగించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయనపై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. క్రీడాకారులపై బహిరంగంగానే వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. రెజ్లింగ్ మహిళా క్రీడాకారినిలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని, బ్రిజ్ భూషణ్ ను శిక్షించాలని భారత రెజ్లింగ్ క్రీడాకారులు ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా ప్రజాస్వామ్య యుతంగా ఉద్యమిస్తున్నారని అన్నారు. దీనిపై ప్రధాని మోడి, క్రీడాశాఖ మంత్రులు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు ఒలంపిక్స్, ప్రపంచ కప్ మొదలగు పోటీల్లో భారతదేశానికి పథకాలు తీసుకొచ్చినప్పుడు తమ ప్రభుత్వ గొప్పగా చెప్పుకొని, క్రీడాకారులతో ఫోటోలు దిగిన ప్రధాని మోడి, క్రీడా మంత్రులు ఇప్పుడు మొహం చాటేయడం అనైతికమని అన్నారు. ఒకవైపు బేటి పడావో బేటి బచావో అని మనకి బాత్ చెప్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, మహిళా క్రీడాకారులు దేశ రాజధానిలో నిరసన చేస్తుంటే వారితో మాట్లాడడం గాని, మంత్రుల ద్వారా చర్చించడం గాని చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. భారత ప్రధాని వైఖరి రేపిస్టులను, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కాపాడే విధంగా ఉండటం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్కే అషర్, ఉపాధ్యక్షులు మహిపాల్, పిఓడబ్ల్యూ జిల్లా నాయకులు నర్సక్క, అంబిక, లలిత, సుమ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

పింఛన్ల పంపిణీ

నవతెలంగాణ ఆర్మూర్

మండలంలోని కోమన్ పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన నాలుగు పెన్షన్లలను సర్పంచ్ నీరడి రాజేశ్వర్ సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారోబార్ నవీన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సివిల్స్ విజేత మహేష్‌ను అభినందించిన కలెక్టర్



మహేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ నిజామాబాద్‌సిటీ

ఇటీవల ప్రకటించిన సివిల్స్‌లో విజేతగా నిలిచి అఖిల భారత సర్వీసులకు ఎంపికైన బోధన్ పట్టణానికి చెందిన కె.మహేష్ కుమార్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు. మహేష్ కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, సివిల్స్ కోసం సన్నద్ధమైన తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యుత్తమ స్థాయిలో 200 ర్యాంకు సాధించడం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ ప్రశంసించారు. మహేష్‌కు స్వీట్స్ తినిపించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిని అధిష్టించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కిషన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడికి సన్మానం



నవతెలంగాణ-వేల్పూర్

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ తలారి సంజీవయ్య సోమవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని జన్కంపేట్ గ్రామానికి చెందిన సంజీవయ్య సికింద్రాబాద్ రైల్ నిలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వేల్పూర్ మండలం జానకంపేటకు చెందిన సంజీవయ్య అంతర్జాతీయ వికలాంగుల క్రీడాకారుడు కావడం విశేషం. కార్మికుల సమస్యల పట్ల నిరంతరం పోరాటానికి సిద్ధం అని సంజీవయ్య విలేకరుల సమావేశంలో తెలిపారు.

మైనార్టీ కళాశాలలో బోధించుటకు అధ్యాపకులు కావలెను

నవతెలంగాణ-బాల్కొండ (ముప్కాల్)

బాల్కొండ మైనార్టీ బాలికల కళాశాలలో పలు సబ్జెక్టులలో బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఇంగ్లీషులో బోధించుటకు ఎంఎస్సీ, ఏంఏ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఏదైనా జూనియర్ కళాశాలలో రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు బాల్కొండలోని మైనార్టీ బాలికల కళాశాలలో సంప్రదించాలని కోరారు.

36వ రోజుకు నిరవధిక సమ్మె



నిజామాబాద్‌సిటీ : పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-ఎడపల్లి

డిమాండ్ల సాధనకు మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ ఆవరణంలో ఐకెపిలో వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 36వ రోజుకు చేరుకుంది. నెలకు 18 వేల గౌరవ వేతనం ప్రభుత్వ మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సీనియార్టీ బట్టి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, సేఫ్ ద్వారా గుర్తింపు కార్డులను అందజేయాలని, సాధారణ భీమాతో పాటు ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని అన్నారు. డీఆర్‌డిఏ ఖాతా నుండి వీవోఏల ఖాతాలోకి నేరుగా వేతనాలను జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో వీవోఏల అధ్యక్షులు సుదర్శన్, కోశాధికారి పోచయ్య, యూసుఫ్, జంగం సంధ్య, శోభ, లత, మహేశ్వరి, మంజుల, కుమ్మరి పుష్ప పాల్గొన్నారు.

జయశంకర్ ఆచార్య ప్రతిభా పురస్కారాలు అందజేత

- పది పాసైన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

2023లో పదవ తరగతి పాసైన 22 మంది విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు జయశంకర్ ఆచార్య విశ్వ స్పూర్తి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభా పురస్కారాలు. నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బోధన్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కేఎం, కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ స్థాయి నుండి పిల్లలు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అప్పుడే మనం అనుకున్నది సాధించగలమని తెలిపారు. ఈ ప్రపంచంలో విద్య ఒక్కటి మాత్రమే అతి నిరుపేదను అత్యంత వివేకవంతుడిగా ధనవంతుడిగా తీర్చిది ద్దుతుందని అన్నారు. ఈ ప్రపంచంలో ఏ స్థాయికైనా తీసుకు పోయే చదువును శ్రద్ధగా చదివినట్లయితే అసాధ్యాలని సుసాధ్యం చేయ వచ్చని అన్నారు. పిల్లలందరూ క్రమశిక్ష ణతో చదవాలని, పెద్దల పట్ల గౌరవభావంతో మెదలాలని, వినయ విధేయతలు కలిగినవారికి చదువు తొందరగా అబ్బుతుందని తెలిపి పిల్లల ప్రతిభను గుర్తించి ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సన్మానిస్తున్న విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం ను అభినందించారు. కార్యక్రమంలో విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవాపురం గోపాలకృష్ణాచార్య, కోశాధికారి కే.శ్రీధర్ ఆచార్య డివిజన్ అధ్యక్షులు బెజ్జంకి గణేశ్ ఆచార్య, ప్రధాన కార్యదర్శి విశ్వరోజు శ్రీనివాస్ ఆచార్య, గౌరవ అధ్యక్షులు నూనె రామచందర్ ఆచార్య, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు సత్య ప్రకాష్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ చారి, ధర్మపురి చారి, సదానందాచారి, శ్రీరాములు, ప్రభు, చంద్రశేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు తిర్చేదెన్నడు

టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు రెగ్యులరైజ్ చేయాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ముందు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు డాక్టర్ వి. దత్త హరి, కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొని మాట్లాడుతూ రెగ్యులరైజ్ అయ్యేవరకు సమిష్టిగా పోరాటం చేస్తామని, కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం జరగబోయే సదస్సులో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కాంట్రాక్టు ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు, డిగ్రీ కాలేజీలో పనిచేసిన ఉపాధ్యాయులకు రెగ్యులర్ చేసినప్పుడు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను ఎందుకు రెగ్యులర్ చేయరాదో ఈ కార్యక్రమంలో తేట తెల్లాం అవుతుందని వారన్నారు. కార్యక్రమంలో హరగోపాల్ తోపాటు 12 యూనివర్సిటీల ప్రతినిధులు, అధ్యక్షులు, జాక్ కన్వీనర్లు, యూనివర్సిటీకి చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొని కాకతీయ యూనివర్సిటీలో జరగబోయే ఆల్ యూనివర్సిటీస్ ఉపాధ్యాయుల సదస్సును విజయవంతం చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జలంధర్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ గంగ కిషన్, డాక్టర్ శరత్, డాక్టర్ మోహన్, కిరణ్ రాథోడ్, డాక్టర్ జోష్నా, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రమ్య ,డాక్టర్ నర్సయ్య, డాక్టర్ గోపిరాజ్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ డానియల్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎన్ఎస్‌యూఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వేణు రాజు కోరారు. జూన్ 18 న నిర్వహించే కాంపిటీషన్ కోసం నిజామాబాద్ జిల్లాలోని యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ జిల్లా గ్రంథాలయంలోని విద్యార్థులను కలిసి రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ వివరాలన, రిజిస్ట్రేషన్ చేసి విధానం తెలిపారు. అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నందున జూన్ 1 నుండి జూన్ 17 వరకు రిజిస్ట్రేషన్ గడువును పెంచారని తెలిపారు. అభ్యర్థులు ముందుగా 7661899899 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ తో కూడిన ఒక ఎస్.ఎం.ఎస్(%నామీ%) ను పొందుతారని, దానిద్వారా వారి వివరాలను అందులో నమోదు చేసుకోవాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతుల కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను కూడా బహుకరిస్తారని, ఈ బహుమతిని సోనియా గాంధీ హైదరాబాదులో ప్రదానం చేస్తారని తెలిపారు. క్విజ్ కాంపిటీషన్ కి 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుందని, అంశాలన్నీ కూడా భారతదేశ భౌగోళిక ,చరిత్ర సాంస్కృతి, తెలంగాణ సాంస్కృతి, చరిత్ర, సామాజిక ఉద్యమాల గురించి ప్రశ్నలు ఉంటాయని ఆయన తెలిపారు. సందేహాలు ఉంటే 8142903456 లేదా 8142803456 నెంబర్లకు కాల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనను సంప్రదించవలసినదిగా వేణురాజ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, సయ్యద్ అశ్రాఫ్, ఇంజిమామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మినీ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల క్రీడా మైదానంలో మినీ సబ్ జూనియర్ అండర్ 11, 13 బాల బాలికల రాష్ట్ర ప్రబబుల్స్ జట్టు శిక్షణ శిబిరాన్ని సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ శిబిరం మూడో తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. తుది జట్టు ఎంపిక చేసి క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్లో ఆర్డిటి స్టేడియంలో జూన్ 6 నుండి 8 వరకు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, టిటియు జిల్లా ప్రెసిడెంట్ పెంట జలంధర్, జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు మర్కంటి సుజాత, చిప్ప నవీన్, వ్యాపారవేత్త పిప్పెర హనుమంతు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీవోఏల అక్రమ అరెస్టును ఖండించండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఐకెపి వీవోఏల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవడం కోసం ముందస్తు పేరుతో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌ను రూరల్ పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే విడుదల చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, ముందస్తు అరెస్టుల పేరుతో నాయకులను నిర్బంధించి ఆందోళనలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు.

కాంగ్రెస్, బీజేపీల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

- బీజేపీ డేంజర్ పార్టీకి అధికారం ఇస్తే ఆర్ఎస్ఎస్ చేతికి తుపాకులిచ్చి చంపేయిస్తుంది
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-ధర్పల్లి

తెలంగాణ పాలనను దేశానికి రోల్ మోడల్‌గా నిలిపిన సీఎం కేసీఆర్‌ను టచ్ చేసే మొనగాడు ఇంకా పుట్టలేదని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం మండల కేంద్రములో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతరం మనల్ని కాపాడే కేసీఆర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుందామని కార్యకర్తలకు, నాయకులకు పిలుపు నిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన సుమారు 3 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీహార్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ లాంటి బీజేపీ పాలిత ప్రాంతాల ప్రజలకు మనం ఇక్కడ కూలీ పనులు కల్పించి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. బీజేపీ ప్రమాదకరమైన పార్టీ అని, దానికి అధికారం ఇస్తే ఆరెస్సెస్ వాళ్ల చేతలుకు తుపాకులిచ్చి ప్రజలను కాల్చి చంపమంటుందని ఆయన ఘాటుగా విమర్శించారు. బీజేపీ నాయకులకు సోషల్ మీడియాలో కూర్చుని దుష్ప్రచారం చేయడమే తెలుసునని, వారికి ఊర్లలో ఒక్క కార్యకర్త కూడా లేడన్నారు. హిందూమతం పేరుతో రెచ్చగొట్టడమే తెలుసునని అన్నారు. ఈ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకునేందుకు రాబందుల్లా తిరుగుతున్నారని, సమయం కోసం వేచి చూస్తున్న గుంటనక్కలు ఆ పార్టీలని జాగరూకతతో ఉండి, ఆ పార్టీల నాయకులను దగ్గరికి రానీయొద్దన్నారు. ఈ రెండు పార్టీలు చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అప్రజాస్వామిక పాలన చేసి ముంబైని దోచుకున్నారని, ఇప్పుడు ఢిల్లీ కేజ్రీవాల్ మీద పడ్డారని విమర్శించారు. కర్ణాటకలో కూడా ఇదే విధంగా అధికారాన్ని గుంజుకుందామని చూశారని, అక్కడి ప్రజలు తన్ని తరిమేశారన్నారు. దశాబ్ది వేడుకల్లో పోడు భూముల పట్టాలు, డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ, దళిత బంధు పథకాన్ని అందిస్తామని చెప్పారు. గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్లు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీ గౌడ్ గారు, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జడ్పిటీసీ, బాజిరెడ్డి జగన్మోహన్ , పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

యువనాయకుడు జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో యువ నాయకుడు దర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ కు మండల నాయకులు. కార్యకర్తలు అడ్వాన్సుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులోభాగంగా ధర్పల్లి సొసైటీ డైరెక్టర్ సాలెహ బేగం ఆజ్మత్ దంపతులు గజమాలతో సత్కరించి అడ్వాన్సుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి దంపతులకు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ చేర్మెన్ మల్లికార్జున్, దర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సీనియర్ పాత్రికేయులు మంచికంటి నరేందర్. తదితరులు పాల్గొన్నారు..



బాజిరెడ్డి జగన్‌ను సన్మానిస్తున్న సొసైటీ డైరెక్టర్ సాలెహబేగం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంచాయతీ కార్మికుల సమస్యలపై ఎంపీడీవోకు వినతి

నవ తెలంగాణ-జక్రాన్ పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై మండలంలోని గ్రామ పంచాయతీ వర్కర్స్ ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఎంపీఓకు వినతి పత్రం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోపరి గంగాధర్, ఉపాధ్యక్షుడు బండి సాయన్న, కార్యదర్శి గోపి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి 10వ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు రాకేష్ ఆధ్వర్యంలో ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అభిషేకం,హోమం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.